# అరవింద

"మీకోసం ఎవరో వచ్చారమ్మా" అటెండరు సదానందం వచ్చి చెప్పాడు అరవిందకు.

"రమ్మను" ఏదో స్టేట్‌మెంట్ చూస్తూ తలెత్తకుండానే అంది.

ఒక నిమిషం తర్వాత అతను లోపలికి వచ్చాడు. తలెత్తిచూసింది అరవింద. ఆశ్చర్యంతో అలా చూస్తూనేవుంది. రెప్పవేయకుండా తీక్షణంగా తనకేసి చూస్తున్న ఆమెను చూసి కలవరపడ్డాడతను. ఆమె మనసులో రేగే తుఫాను అతనికి తెలీదు.

"మేడమ్ నాపేరు నిశాంత్" గొణుగుతున్నట్లుగా అన్నాడతను.

అప్పటికి ఆశ్చర్యం నుంచి తేరుకుని "కూర్చోండి" అంది.

నిశాంత్ కూర్చున్నాడు.

"ఏం పనిమీద వచ్చారు?" ఆఫీసు పనిగురించి వచ్చాడేమోనని అడిగింది.

"మీతో పర్సనల్‌గా మాట్లాడుదామని"- అని కాసేపాగి "మీరేమీ అనుకోనంటే చెపుతాను". అరవింద మొహం చూస్తుంటే అతనికి బెరుగ్గా వుంది.

"మా నాన్నగారి పేరు ప్రకాశరావు. నేను పోస్టల్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నాను."

"ఊఁహూ"

"నిరంజనరావుగారు మాకు దూరపు బంధువు. మీగురించి ఆయనే చెప్పారు.... "ఎలా చెప్పాలో అర్థంకానట్లు ఆగిపోయాడు నిశాంత్".

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుంది." అతని భావాలు జాగ్రత్తగా గమనిస్తూ అంది అరవింద.

"ఈ ఊరే కదండి ఎప్పుడయినా చూసి ఉండవచ్చు."

"నన్ను మీరెక్కడయినా, ఎప్పుడయినా చూశారా?" ప్రశ్నించింది అరవింద.

లేదన్నట్టు తలూపాడు.

అతను ఎందుకొచ్చాడో అర్థమైంది అరవిందకు.

"ఒకరకంగా మీరొచ్చింది పెళ్ళిచూపులకి కదా! నన్ను చూశారు. ఇప్పుడు మీ అభిప్రాయమేమిటో సిన్సియర్‌గా చెప్పండి." అప్పటివరకూ సీరియస్‌గా వున్న ముఖంపైకి కాస్తచిరునవ్వు తెచ్చుకుని అంది అరవింద.

అప్పుడు కాస్త రిలాక్సింగ్‌గా ఫీలయ్యాడు నిశాంత్. కానీ ఆమె అంత సూటిగా అడగడంతో కొంచెం తడబడ్డాడు. అయినా సర్దుకుని

అన్నాడు "మిమ్మల్ని మొదటి చూపులోనే ఇష్టపడ్డానండీ మీరు ఓ.కే. అంటే...." ఆ తరువాత ఏం మాట్లాడాలో అర్థంకాలేదు నిశాంత్‌కి. అతని అవస్థచూసి పెద్దగా నవ్వేసింది అరవింద.

ఆమెను ముందు తెల్లబోతూ చూసి తరువాత తనూ నవ్వేశాడు.

"మీరు ఇంటికిరాకుండా ఆఫీసుకు వచ్చిన కారణం తెలుసుకోవచ్చా?"

ఆమె పదేపదే తన చేతినీ, మానుతున్నగాయాన్నీ చూస్తూండడం గమనించి కొంచెం ఇబ్బందిగా ఫీలవుతున్నాడు నిశాంత్.

"ఇక్కడయితే పర్సనల్‌గా కలుసుకోవచ్చని.... మీతో మాట్లాడి పరస్పరం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించవచ్చని...."

కానీ మాట్లాడిన రెండుమూడు నిమిషాల్లో అరవిందతత్వం ఆవగింజంతకూడా అర్థంకాలేదు నిశాంత్‌కి. ఈ అమ్మాయికి ఇది అహంకారమో, స్వభావమో అంతుబట్టడం లేదు. ఇంటర్వ్యూ బోర్డులో కూర్చుని ఉద్యోగానికి వచ్చినఅభ్యర్థిని ప్రశ్నలడుగుతున్నట్లుంది ఆమె తీరు. ఇలాంటి మనిషిని చేసుకుంటే ఆ కాపురం ఎలా ఉంటుంది? నిరంజనరావుగారన్న మాటలాక్షణంలో గుర్తొచ్చాయి." అరవింద లక్షణమైనపిల్ల. ఆఫీసర్ హోదాలోఉన్నా గర్వమన్నది ఏకోశానా లేదు. తెలివితేటలు సమర్థత రెండూ ఉన్నాయి. అందువల్ల ఆ అమ్మాయి పెళ్ళివిషయం పూర్తిగా ఆమెకే వదిలేశారు వాళ్ళ అమ్మా నాన్న. కూతురుమీద అంత నమ్మకం

వాళ్ళకు. మర్యాదకు పెట్టింది పేరు. ఇంతెందుకు? ఒకసారి వెళ్ళి మాట్లాడిరా"

"కట్నమెంత కావాలి"? ఆ ప్రశ్న రెండోసారి వేసినట్లుంది అరవింద.

నిశాంత్ ఆలోచనల్లోంచి తేరుకుని ఉలిక్కిపడి "ఆఁ" అన్నాడు.

"కట్నమెంత కావాలి?" మళ్ళి ప్రశ్నించింది.

"అబ్బే! కట్నం ప్రసక్తే లేదండీ. కట్నం తీసుకోవద్దన్నది నా మొదటి ఆదర్శం...."

"అంటే మీకింకా చాలా ఆదర్శాలున్నాయన్నమాట. అవేమిటో చెప్తారాండీ...."

"పెళ్ళి నిరాడంబరంగా జరగడం కోరుకుంటాను. వీలైతే మీరిష్టపడితే.... ఐమీన్ నాకాబోయే పార్టనర్ ఇష్టపడితే రిజిష్టర్ మేరేజ్ జరిగితే బాగుంటుంది. ఆదర్శమైన దాంపత్య జీవితం గడపాలి. స్త్రీకి కూడా మగాడితోపాటు అన్ని విషయాల్లోనూ సమాన హక్కులుండా లంటాను" తను చాలా గొప్పసిద్ధాంతాలు వల్లించినట్లు, వల్లె వేయడంలోనే అలసిపోయినట్లు ఫీలవుతూ తన ఉపన్యాసం ముగించాడు నిశాంత్.

చాలా శ్రద్ధగా వింది అరవింద.

"నిశాంత్‌గారూ! నాకో వారంరోజులు టైమివ్వగలరా? ఆలోచించు కోడానికి"

"తప్పకుండా ఆలోచించుకోండి. కానీ ఈ నిశాంత్ మిమ్మల్నే మనసులో నిలుపుకున్నాడని మరువకండి...." అన్నాడు లేచినిలుచుంటూ.

"మనసులో నిలుపుకోవడం, ప్రేమించడం లాంటి నవలల భాష మీద నాకంతగా నమ్మకంలేదు. వచ్చే శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు మా ఇంటికి టీకి రండి..." అంది అరవింద మళ్లీ ఫైల్లోకి తల దూరుస్తూ.

"అలాగే! నమస్కారమండీ" అంటూ బయటకు నడిచాడు.

"నేను మరీ నా వ్యక్తిత్వాన్ని కోల్పోయి మాట్లాడానా ఆవిడ దగ్గర" —అని ఓక్షణం అనిపించిందతనికి. కానీ ఆ అమ్మాయిది చాలా ప్రత్యేకమైన వ్యక్తిత్వం అనుకున్నాడు.

అరవింద మనసు గందరగోళంగా తయారయింది. పనిలో లీనం కావడానికి బలవంతంగా ప్రయత్నిస్తోంది.

* * *

మూడురోజుల తరవాత అరవింద సినిమాకు వెళ్ళింది. ఇంకా సినిమా మొదలుపెట్టలేదు. బయట నిలబడి ఉంటే కాలేజీలో తన క్లాస్ మేట్ జ్యోతి కనబడింది. తన పక్కనున్న అతణ్ణి అన్నగా పరిచయం చేసింది. "నీకు అన్నయ్యలు లేరుకదా!" అంది ఆలోచనగా.

మా పెద్దనాన్నగారబ్బాయి. పేరు విజయ్ అని బదులిచ్చింది.

"నమస్తే" అన్నాడతను.

అతను తనను గుచ్చి గుచ్చి చూడడం గమనించింది అరవింద.

అతణ్ని చూస్తుంటే మనసులో ఏదో జ్ఞాపకాలతెర కదిలింది. ఒక్కనిమిషమే జ్యోతితో మాట్లాడింది. సినిమా టైమ్‌కావడంతో హాల్లోకి వెళ్ళిపోయింది సీటు నంబరు చూస్తూ!

తనను వెన్నాడుతున్న విజయ్ చూపులు వెనకనుంచి గుచ్చుకుంటున్నట్లనిపించింది.

మర్నాడు మధ్యాహ్నం ఒంటిగంటకు లంచ్ టైమ్‌లో టీ తాగుతూ దినపత్రిక చేతిలోకి తీసుకుంది అరవింద.

"నమస్తే" అన్న పలకరింపుకు సరిగా కూర్చుని పేపరు పక్కన పడేసింది.

"ఓహ్! మీరా రండి కుర్చోండి." అంది ఆహ్వానిస్తూ, అటెండర్‌కి చెప్పింది-ఇంకొక టీ తెమ్మని.

"మిమ్మల్ని చూడాలనిపించిందండీ. వెంటనే వచ్చేశాను...." అన్నాడు కూర్చుంటూ విజయ్.

"బాగుందండీ! నిన్ననేగా మొదటిసారిగా మనం కలుసుకున్నాం." అంది అరవింద నవ్వుతూ, ఆ నవ్వులో ఎగతాళి తొంగిచూసింది.

"హాస్యం కాదండీ! నిజం చెప్పమంటారా? నిన్న సినిమా చూడలేకపోయాను. రాత్రి నిద్రపట్టలేదు....."

"అంత భయంకరంగా ఉన్నానా నేను...."

"ఎంతమాట! కళ్ళుతెరిచినా, మూసినా మీ రూపమే."

"విజయ్!" పిలిచింది అరవింద.

"ఏమండీ" అన్నాడు విజయ్.

"ఇప్పుడు మీ వయస్సెంత?" ప్రశ్నించిందామె.

"ఇరవై తొమ్మిదేళ్ళండీ...." అన్నాడు అతను తెల్లబోతూ.

"అందుకనే-మీరు మరీ పదిహేనేళ్ళ టీనేజ్ కుర్రాడిలా కాకుండా వయస్సును బట్టి మాట్లాడండి. నేను టీనేజ్ దాటినదాన్నే! అంతేకాదు ప్రేమించుకోవడం మీద నాకంత సదభిప్రాయంలేదు. అన్నట్లు మీకు పెళ్ళైందా?"

"లేదండి నాకు నచ్చిన యువతి కోసం అన్వేషిస్తున్నాను. ఒక శుభవార్త చెప్పనాండీ! నిన్నటితో నా అన్వేషణ పూర్తయింది...." ఆమెను గమనిస్తూ అన్నాడు.

"ఆహా! అయితే త్వరలో "శుభలేఖ" ఇవ్వబోతున్నారన్న మాట"

"కానీ నాకు ఆ అమ్మాయి మనసే తెలియదింతవరకూ. ఇప్పుడొచ్చిందే అది తెలుసుకోడానికే!"

ఆమె ముందు తెల్లబోతుందనీ తర్వాత సిగ్గు పడుతుందనీ అనుకున్న అతని ఊహ తలకిందులైంది.

"అదంత తొందరగా తేలేవిషయం కాదు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు మా ఇంటికి రండి...." ఆమె మొహంలో ఏ భావంలేదు.

ఆఫీసు ఫైలు చేతిలోకి తీసుకుని పెన్నుతీసుకుంది అరవింద. అంటే ఇకతను మాట్లాడటం అయిపోయిందని చెప్పడమన్నమాట! ఆమెతో ఇంకాసేపు మాట్లాడాలని ఉంది. ప్రేమకబుర్లతో కాలక్షేపం చేయాలని ఉంది. కానీ అరవింద ఆ అవకాశం ఇవ్వలేదు. తప్పదన్నట్లు కుర్చీ లోంచి లేచినుంచున్నాడు.

అతను నుంచున్నాక హఠాత్తుగా అడిగింది అరవింద- "విజయ్ గారూ! మీరు "ఆరనిచిచ్చు "సినిమా చూశారా?"

"ఆ? చూశానండి. చాలాబాగుంది. నాకు నచ్చిందండీ. మీరు చూశారా? మీకు ఎలా ఉందండీ సినిమా?"

ఏకధాటిగా ప్రశ్నల వర్షం కురిపించాడు! మళ్ళీ కుర్చీలో కూర్చుంటూ.

"మీరు ఆ సినిమా ఎప్పుడు చూశారు?" అతని మిగిలిన ప్రశ్నలు వినిపించుకోకుండా అడిగింది.

"ఏమో గుర్తులేదు. నెలరోజులైనట్లుంది...."

"ఏ రోజు చూశారో, ఏ షో చూశారో చెప్పగలరా?"

"అవన్నీ ఎందుకు మేడమ్, పోలీసు ఇంటరాగేషన్‌లా" అన్నాడు నవ్వుతూ.

"ఏమైనా అనుకోండి. నాకు జవాబు కావాలి...."

"ఆఁ నా డైరీలో నోట్ చేశాను. అంత ముఖ్యమైతే ఇవాళే చూసి చెప్తాను."

"ఇవాళ వద్దులెండి. శనివారం వస్తారు కదా! అప్పుడు చెప్పండి. ఆఁ! ఆవేళ మీరూ, మీ ఫ్రెండ్ నిశాంత్ వెళ్ళారా?"

"అరే. నా ఫ్రెండ్ నిశాంత్ మీకెట్లా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీరెట్లా తెలుసో ఆయనా అలాగే తెలుసు. చాలా మంచివాడు." అంది ఒత్తిపలుకుతూ అరవింద.

"ఆఁ! అవునండి-ఆవేళ సినిమాకి వెళ్ళింది మేమిద్దరమే. సెకండ్ షోకి వెళ్ళాం. మరీ డిటెక్టివ్ నవలలోలా సస్పెన్స్‌లో పెట్టేస్తున్నారు."

"సస్పెన్సేం లేదులెండి. శనివారం మధ్యాహ్నం మా ఇంట్లో చిన్నపార్టీ ఉంటుంది."

"ఐసీ! ఎంతమందిని పిలిచారేమిటి?" అన్నాడు విజయ్....

"మీరుకాక నా ఫ్రెండ్ ఇంకొకరు అంతే. అవునూ మా ఇంటి అడ్రసు అడగలేదు మీరు!"

"నాకు తెలుసండీ! మరి నేనిక వస్తాను." ఉత్సాహంగా నిష్క్రమించాడు విజయ్.

*　　　*　　　*

సరిగ్గా మూడుగంటలు అవుతుండగా నిశాంత్ వచ్చాడు. అతడిని ఆహ్వానించి కూర్చోబెట్టింది అరవింద.

అతను వచ్చిన పది నిమిషాలకి విజయ్ ప్రవేశించాడు. అక్కడ ఇద్దరూ ఒకరినొకరు చూసుకుని తెల్లబోయారు. ఇద్దరూ ఎంత స్నేహితులైనా ఇక్కడి పరిస్థితి ఇబ్బందిగా ఉంది. బలవంతాన చిరునవ్వుతో పలకరించుకున్నారు.

"మిమ్మల్ని ఒకరికొకరు పరిచయం చెయ్యాల్సిన అవసరం లేదుగా" అంది నవ్వుతూ అరవింద.

అసలు అరవింద ఉద్దేశం ఏమిటో ఇద్దరికీ అంతుపట్టకుండా ఉంది.

"మీరు "ఆరనిచిచ్చు" సినిమాకు వెళ్ళింది ఏప్రిల్ తొమ్మిదవ తేదీ, రాత్రి సెకండ్‌షోకి! కరెక్టేనా?" అంది మళ్ళి విజయ్‌ని ఉద్దేశించి.

"అవును. మీకెట్లా తెలుసు?" ఆశ్చర్యపోతూ అడిగాడు విజయ్

"ఆరోజు సినిమానుంచి నేరుగా ఇంటికి వెళ్ళిపోయారా?"

ఆవేళ ఆఫీసులో ఉద్యోగంకోసం వచ్చిన కాండిడేట్‌ను ఇంటర్వ్యూ చేసినట్టు ప్రశ్నలు వేసింది. ఈరోజు కోర్టులో ముద్దాయిని బోనులో

నిలబెట్టి అడిగినట్టు అడుగుతోంది. అసలేమిటి ఈవిడ ఉద్దేశం? అనుకున్నాడు నిశాంత్.

ఆ ప్రశ్నకు ఇద్దరి మొహాల్లోనూ రంగులు మారాయి. అయినా సర్దుకుని "అవును" అన్నారు.

"దారిలో వస్తున్నప్పుడు ఆలయంలో ఏం జరిగింది?"

ఈసారి ఇద్దరూ అదిరిపడటం స్పష్టంగా చూసింది అరవింద.

"ఆలయమా? ఏం ఆలయం? ఏం జరిగింది?...." అన్నారిద్దరూ తడబడ్తూ.

"ఏం జరిగిందో వివరంగా చెప్పమంటారా?"

ఇద్దర్లో ఎవరూ మాట్లాడలేదు.

అరవింద చెప్పడం ప్రారంభించింది. "ఆ రోజు సెకండ్‌షో వదిలి పెట్టారు. సినిమా చూసిన ఇద్దరమ్మాయిలు బయటికి వచ్చి ఇంటికి ఎట్లా వెళ్ళాలా అని ఆలోచిస్తూ నిలబడ్డారు. చూస్తుండగానే హాలు దగ్గర నిర్మానుష్యమైపోయింది. ఆటోలుకాని, రిక్షాలుకాని లేవు. ఎక్కడేది దొరికితే అది ఎక్కి వెళ్దామని నిర్ణయించుకుని నడక సాగించారు.

"కొంత దూరం నడిచేసరికి వెనక ఎవరో వస్తున్న అలికిడికి తలతిప్పి చూస్తే కరెంటుదీపాలు వెలగని ఆ రోడ్డుమీది ఇద్దరు మగాళ్లు వెంబడిస్తూ కనబడ్డారు. అమ్మాయిలిద్దరికీ భయమేసింది. నడక వేగం పెంచారు. రోడ్డుమీద ఈ నలుగురూ తప్ప జనసంచారం లేదు. నడుస్తూ ఓ గుడి దగ్గరికి వచ్చారు.

"అక్కడ చెట్లు, పొదలు, తుప్పలు, అక్కడికిరాగానే మగాళ్ళిద్దరూ చెరొకళ్ళనీ గట్టిగా పట్టుకుని చీకట్లోకి లాక్కుపోయారు. అమ్మాయిలు ఎంత ప్రతిఘటించినా, ఎంత అరచినా ప్రయోజనం లేకపోయింది. ఇద్ద రిలో ఒకమ్మాయి మాత్రం ఒకడిని కండ ఊడొచ్చేలా కొరికి పారి పోయింది. మిగిలిన ఆ అభాగ్యురాలిని ఒకరి తరువాత ఒకరు క్రూరంగా అనుభవించారు...." చెప్పడం ఆపింది అరవింద.

నెత్తురు చుక్కలేనట్టు ఇద్దరి మొహాలూ పాలిపోయాయి. అప్రయ త్నంగా నిశాంత్ తన చేతి వైపు చూసుకున్నాడు

"ఇంతకీ ఈ కథ ఎందుకు చెప్పారు?" విజయ్ తేరుకుని అడి గాడు.

"కథా! నేను కథ చెప్పానా? ఇది యదార్థం. పచ్చినిజం. దానికి మీరే సాక్ష్యం!"

"అంటే?" వెలవెలబోతూ అన్నాడు నిశాంత్.

"అంటే ఏముంది కిరాతకం చేసింది మీరైతే బలైంది నేను. నా జీవితాన్ని మంటగలిపారు మీరు. ప్రేమ, ఆదర్శం ముసుగుంతో ఆశ దాన్ని ఆట వస్తువుగా చేసి ఆడేమీకు పెళ్ళెందుకు?" కాళికలా, రౌద్రంగా మారి నిలుచున్న ఆమెను ఒక్కక్షణం చూసి నిశాంత్, విజయ్ సైగచేసు కుని ఒక్కసారిగా ఆమె మీదపడి ఒడిసిపట్టుకుని, "ఇప్పుడు కూడా అనుభవిస్తామే- ఏం చేస్తావ్? చెడిపోయిన దానివేకదా, నిన్ను మేమెలాగూ పెళ్ళిచేసుకోము. నువ్వు ఈ ఇంట్లో ఒంటరిగా వున్నావన్న విషయం

కూడా తెలుసు. ఏదో ఇద్దరం ఇట్లా వస్తూ పోతూ ఉంటాం. పెళ్ళి చేసుకోంగానీ, ఇద్దరం మొగుళ్ళలానే వ్యవహరిస్తాం ఆలస్యమెందుకు.... రావే...." గింజుకుంటున్న అరవిందను గుండెలకు హత్తుకుంటూ అన్నాడు.

అప్పటికి వాళ్ళ మంచితనమనే ముసుగు జారిపోయింది.

హఠాత్తుగా గాలిలోకి గన్ పేలింది. ఉలిక్కిపడి అరవిందను వదిలేసి స్టైయిర్ కేస్ వైపు చూశారు- నిశాంత్, విజయ్‌లు.

"మేజర్" అంటూ మెట్లవైపు పరిగెత్తింది అరవింద.

మేజర్‌రావ్ అరవిందకు బావ. వాళ్ళకి అయిదారు నెలల కిందటే నిశ్చితార్థం జరిగింది. సెలవుపెట్టి ఇప్పుడు వచ్చాడు. ఆమెను పెళ్ళిచేసుకోవడానికి.

ముందు ఉలిక్కి పడ్డా తరవాత నిశాంత్ అన్నాడు "నువ్వెవరు?"

"ముందు మర్యాద నేర్చుకో! నేను అరవిందకు బావని. కాబోయే మొగుణ్ని. మీ పాలిట యముణ్ని...." అన్నాడు.

విజయ్ పెద్దగా నవ్వాడు.

"ఎందుకు నవ్వుతావ్" గర్జించాడు మేజర్

"ఎందుకా? ఈ చెడిపోయిన దాన్ని చేసుకుంటున్నావే పాపం అని."

"షటప్! మీరు, పశువులు తేడాలేదు. మనుషులందరూ మీలాంటి హీనులే అయితే ఈ ప్రపంచం ఇట్లా ఉండేదికాదు. మీలాంటి నీచులు బతకటం ఈ భూమికే భారం. అరవిందా! ఇదిగో ఈగన్ తీసుకో వీళ్ళ అంతం చూడు...."

ఈ రోజుతో మీ ఆయుష్షు మూడిందిరా. ఇలాంటి వాళ్ళని వదలి పెట్టకూడదు. అరవిందా! కానీ...."

అరవింద చేతిలో గన్ ఉంది. ఆమె మనస్సులో వాళ్ళమీద కసి ఉంది. ఆ ఇద్దరి గుండెల్లో గన్ చూసిన భయం ఉంది. అదే క్షణం విజయ్, నిశాంత్ ఇద్దరూ అక్కడి నుంచి పరిగెత్తారు, గుమ్మంవైపు.

కానీ ఆమె చేతిలో "గన్" పేలలేదు! ఎందుకంటే ఆమె పూర్తిగా మనదేశపు సగటు స్త్రీ.

"నువ్వు ఆ గన్ పేల్చలేవని తెలుసు అరవిందా. నీలాంటి అరవిందలున్నంత కాలం విజయ్, నిశాంత్ వంటి మేకవన్నె పులులు తిరుగుతూనే ఉంటాయి...." మేజర్ నిట్టూర్చాడు. ఆ ఇద్దరూ బతుకు జీవుడా అని అక్కడి నుంచి జారుకున్నారు.

ఆరవింద మేజర్ గుండెల మీద వాలిపోయింది.

(మయూరి సచిత్ర వారపత్రిక 22-2-1986)